క్లుప్తంగా

నేడు, రేపు అల్లాడుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో శుక్ర, శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. పంచాయతీలో రెండు రోజులు మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

నరసాపురంలో ర్యాలీ



నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

కాశినాయన : బాల్య వివాహాలను అరికట్టాలని గురువారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం నరసాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏపీఎం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు



ఖాదర్‌వలిని అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రవీంద్ర హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఖాదర్‌వలి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందాడు. కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలో గురువారం ఉమ్మడి కడప జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

జేసీఎస్-1 మండల కన్వీనర్‌గా ఓబయ్య యాదవ్

ప్రొద్దుటూరు : జేసీఎస్ -1 మండల కన్వీనర్‌గా ఓబయ్య యాదవ్‌ను నియమించారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీటీసీగా ఉన్న ఓబయ్య యాదవ్ తొలి నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జేసీఎస్-1 మండల కన్వీనర్‌గా నియమించారు.

సకల పూజలూ భగవత్ ఆరాధనలో భాగమే

బద్వేలు అర్బన్ : సకల పూజలూ భగవత్ ఆరాధనలో భాగమే అని శ్రీమద్ అష్టాక్షరీ పీఠం పీఠాధిపతులు శ్రీత్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులో గల గోవింద మఠం ఆవరణలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి అనుగ్రహ భాషణం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొండపల్లివెంకటసుభాష్‌కుమార్, కొవ్వూరువెంకటనారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా షేక్ ఉమ్మర్

బద్వేలు అర్బన్ : వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా బద్వేలుకు చెందిన షేక్ మహమ్మద్ ఉమ్మర్ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పట్టణంలో మైనార్టీ నాయకుడిగా కొనసాగుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ఉమ్మర్‌ను పార్టీ అధిష్టానం గుర్తించి వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమించింది.

భావిభారత నిర్మాతలు ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : భావిభారత నిర్మాతలు ఉపాధ్యాయులు అని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవిశంకర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణలు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక రాధాకృష్ణనగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చిన్నివెంకటేశ్వర్లు, ఆర్.విద్యావతిలను ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు చెన్నయ్య, రఘురాములు, పూసలవాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్ ప్లాంట్ సాధన ర్యాలీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే స్టీల్ ప్లాంట్ సాధన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతమ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కడపలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుండి పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ అనంతరం కార్నర్ మీటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన



ప్రొద్దుటూరు : వైద్య శిబిరానికి వచ్చిన వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బి.కోడూరు : పాయలకుంట్లలో మందులను పంపిణీ చేస్తున్న బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ



చాపాడు : ఖాదర్‌పల్లెలో వైద్యం చేయించుకుని మందులు తీసుకుంటున్న లబ్ధిదారులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడుతూ వైద్య పరీక్షలు ఎలా జరుగుతున్నాయని, ఏ మేరకు ఉపయోగపడుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలకంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలు దీని వలన ఎక్కువగా లబ్ధి పొందుతున్నారన్నారు. అందుబాటులో వైద్య సేవలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ముఖ్యమంత్రి జగన్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం వారికి నిజంగా వరమేనన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఎంపీపీ శేఖర్ యాదవ్, గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు నశ్యం శ్రీనివాసులు, నాగాయపల్లె రమణారెడ్డి, షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది
– ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పాయలకుంట్ల సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరైన శిబిరాలను పరిశీలించడంతో పాటు వలంటీర్లు గ్రామంలో గడప గడపకు వెళ్ళి సర్వే చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ చెన్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నరసమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ యోగానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దారు విద్యాసాగర్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో, మండల పరిధిలోని బాలాయపల్లె సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని మాట్లాడారు. ఏ ఒక్క నిరుపేద అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఇదే సమయంలో ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరాపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మండల అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నసుబ్బారెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : మండలంలోని కొత్రపాటిపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 351 మంది రోగులను పరీక్షించి వారికి మందులను అందజేశారు. కంటి వెలుగు కింద 96 మందికి పరీక్షలు చేశారు. ఆరోగ్య సురక్ష బుక్‌లెట్ అందచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్‌ఎంపీపీ-1 సీఎం బాషా, వైస్ ఎంపీపీ-2 చెన్ను రాజశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దారు గంగయ్య, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని ముడుమాల గ్రామ సచివాలయ పరిధిలోని సిద్దయ్య గారి మఠంలోని స్వామి సర్వమత అన్నదాన సత్రం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామంలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ తెలియజేశారు.

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లె సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 408 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 6 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 295 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని ఐదు మంది వైద్యులతో వేర్వేరు విభాగాల్లో రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ షమీమ్ భాను, వైద్యులు ఓబులేసు, ప్రవీణ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, సీహెచ్‌ఓ మహదేవయ్య, ఎంపీహెచ్‌ఈఓ రాఘవయ్య, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోలెరో బాషా, జైనుల్లా పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

బ్రహ్మంగారిమఠం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల సమాఖ్య వార్షిక మహా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ ఐబీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హరి ప్రసాద్ రాజు, ఎస్.ఆర్‌ఎల్‌ఎం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చిట్టిబోయిన హర ప్రసాద్‌రాజు మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలు అభివృద్ధి బాటలో నడవడానికి గ్రామ సంఘం అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా శోభారాణి..

బ్రహ్మంగారిమఠం మండల సమాఖ్య అధ్యక్షురాలిగా వి.శోభారాణి, ఉపాధ్యక్షురాలిగా ఎస్.కుమారి, కార్యదర్శిగా టి.చైతన్య, కోశాధికారిగా బి.రమాదేవి, ఉప కార్యదర్శిగా ఏ.ఆదిలక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల సమాఖ్య ఏపీఎం ప్రకాశ్‌రావు తెలిపారు.

కాలనీల్లో వసతులు కల్పించాలి

మైదుకూరు : పట్టణంలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఏవీ శివరామ్, అధ్యక్షుడు పి.భాస్కర్ మాట్లాడుతూ పేదల కాలనీల పట్ల మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని అన్నారు. వీణా విజయరామరాజు కాలనీ, చెంచుకాలనీ, వెంకటసుబ్బయ్య కాలనీ లాంటి పేదలు నివసిస్తున్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు బీవీ శ్రీనివాసులు, బి.పీరయ్య పాల్గొన్నారు.

రాయలసీమకు మళ్లీ మోసమే

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్యలో జల జగడాలను పెడుతోందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా కర్నాటక ఎన్నికల్లో రాయలసీమకు అన్యాయం చేస్తూ అప్పర్ భద్ర ప్రాజెక్టును కేంద్రం ప్రకటించిందని, తద్వారా తుంగభద్ర నుంచి రాయలసీమకు వచ్చే నీటిలో కోత పడుతుందని ఆయన పేర్కొన్నారు. రానున్న తెలంగాణ ఎన్నికల్లో కృష్ణా జలాలను కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఎన్నికలకు అనుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతందని తెలిపారు. ఈ విషయంలో రాయలసీమ బిడ్డ అయిన బీజేపీ నాయకుడు సత్యకుమార్ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కాశినాయన : మండలంలోని కోడిగుడ్లపాడు సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు వైద్యశిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు.

నేడు సమావేశం

పోరుమామిళ్ల : పట్టణంలోని పద్మావతి కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 'మళ్లీ ఎందుకు జగనే కావాలి' అనే అంశంపై సమావేశం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్, మండల నాయకులు, గృహ సారథులు, జేసీయస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

జూదరుల అరెస్టు

సింహాద్రిపురం : మండలంలోని జంగంరెడ్డిపల్లెలో గురువారం సత్రం వెనుకవైపు ఉన్న ముళ్లపొదలలో జూదం ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారివద్దనుంచి రూ.15,300లు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : భాకరాపురంకు చెందిన బండి శ్రీరామిరెడ్డి బుధవారం మరణించారు. ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మృతుని ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఎవరైనా మరణించినట్లైతే 99665 09364, 7093204537కు సమాచారం ఇవ్వాలన్నా రు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌లో 85 శాతాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు మండలం ముక్కొండ వద్ద రూ.4 కోట్లతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం వ్యవసాయానికి ప్రభుత్వం కేటాయిస్తోందని అన్నారు. మరో 15 శాతాన్ని ఎస్సీలకు, ఇతర వర్గాలకు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. మిగిలిన 15 శాతం నుంచే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ముక్కొండ వద్ద నిర్మించిన సబ్ స్టేషన్ వల్ల జీవీ సత్రం ప్రాంతంలోని పలు గ్రామాలకు మున్సిపాలిటీలోని ఎల్లంపల్లి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సమస్య తీరుబోతోందని పేర్కొన్నారు. ముక్కొండ వద్ద ఏర్పడుతున్న జగనన్న కాలనీలో 2800 ఇళ్లు కడుతున్నారని తెలిపారు. అందులో నివాసం ఉండబోయే కుటుంబాలకు, సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న 40 పరిశ్రమలకు విద్యుత్ సమస్య ఉండబోదని తెలిపారు. మండలంలో, మున్సిపాలిటీలో రోడ్లు, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతులు సమకూరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఎస్.రమణ మాట్లాడారు. వ్యవసాయ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, నంద్యాలంపేట సర్పంచ్ చెన్నూరు ఓబయ్య, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గల్లా నరసింహారెడ్డి, విద్యుత్ డీఈఈ రామిరెడ్డి, ఏడీఈలు శ్రీనివాసరెడ్డి, శివభాస్కర్(కన్‌స్ట్రక్షన్), ఏఈ రామభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : మండలంలో వైఎస్ఆర్‌సీ పార్టీ మరింత బలోపేతం కావాలంటే అర్హులకు సంక్షేమ పథకాలు అందేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. మండల కేంద్రంలోని బొజ్జిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం అట్లూరు మండల ప్రజా ప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు ఎందుకు ఆంధ్రాకు జగనే సీఎం కావాలి అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలంలో మంచి మెజార్టీ సాధించిందని దీనిని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధలు కోరారు. కులాలు, మతాలు, పార్టీలు అనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అర్హులను గుర్తించి అందిస్తున్నారన్నారు. మండలంలో గత ఎన్నికల్లో 11 వేల పైచిలుకు మెజార్టీ వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా అంతకంటే ఎక్కువ మెజార్టీ రావాలని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి చైర్మన్ మాధవరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మణ్యం మల్లికార్జునరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు మల్లికార్జునరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రజల సమస్యలను పరిష్కరించాలని గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ పారిశుధ్య లోపం వల్ల మున్సిపాలిటీలో దోమల బెడద పెరిగి ప్రజలు విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. దోమల నివారణకు నాసిరకం మందులను వాడుతున్నారన్నారు. మందులను సరఫరా చేసే కంపెనీపై , కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని హోటళ్లు, రెసిడెన్సీలు, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, ఫంక్షన్ హాళ్ల వ్యర్థాలను డ్రైనేజీల్లోనే వేస్తున్నారన్నారు. దీంతో దుర్వాసనతోపాటు దోమలబెడద పెరిగిపోయిందన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు దేవరశెట్టి నరసింహా, మచ్చా శీను, హరి, యేసోబు, రమేష్‌రెడ్డి, వీరయ్య శెట్టి, ప్రమీల, సుజాత, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు సందీప్‌కుమార్, సహాయ కార్యదర్శి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సును ఆకాంక్షించే వ్యక్తి ఉపాధ్యాయుడు



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తదితరులు



ఆదిత్యారాంపేట పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

ప్రొద్దుటూరు కల్చరల్ : సమాజ శ్రేయస్సును ఆకాంక్షించే తొలి వ్యక్తి ఉపాధ్యాయుడు అని ఎస్ఎస్ఏ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతా శ్రమంలో గురువారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి గానుగపెంట హనుమంతరావు అధ్యక్షతన సభను ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 30 మంది ఉపాధ్యాయులను పీఓతోపాటు ఎంఈఓ సావిత్రమ్మ, శోభారాణి, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి శాలువా కప్పి పూలమాలతో, మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఎల్‌వీ రమణయ్య, డాక్టర్ రవిశంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేశవరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, అంకాల్ కొండయ్య, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : తెలిపారు. గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆదిత్యారాంపేట ఉన్నత పాఠశాలలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలల పరిరక్షణ, విద్యాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలత, మండల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించినా నేరమే

మైదుకూరు : బాల్య వివాహాలను చేయడమే కాకుండా వాటిని ప్రోత్సహించినా నేరమేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. మండలంలోని శివపురంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామ కమిటీల ఏర్పాటు

సమావేశంలో శివపురం సచివాలయ పరిధిలో గ్రామ స్థాయి బాల్య వివాహాల నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేశారు. శివపురం కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్‌ఓ నాగేంద్ర, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరబాబు, ఏఎన్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి, మరికొందరు ఎంపికయ్యారు. ముత్తరాయపల్లె గ్రామ కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ చెన్నమ్మ, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వీఆర్‌ఓ నాగేంద్ర, ప్రభుత్వ ఉపాధ్యాయిని నీలావతి, ఏఎన్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల తదితరులు ఎంపికయ్యారు. ఈ రెండు కమిటీల కన్వీనర్‌గా సచివాలయ మహిళా పోలీసు మౌనిక వ్యవహరిస్తారు.

ఈ స్టాంప్‌లను సద్వినియోగం చేసుకోండి



ఈ స్టాంపులను విడుదల చేస్తున్న సుబ్బారెడ్డి

కమలాపురం : స్థానిక డీసీసీ బ్యాంక్‌లో అందుబాటులో ఉన్న ఈ స్టాంప్‌లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక డీసీసీ బ్యాంక్‌లో ఈ-స్టాంప్‌లను విడుదల చేశారు. భూములు, స్థలాలు, ఇళ్లు తదితర క్రయ విక్రయాలు జరుపుకునే వారికి డీసీసీ బ్యాంక్‌లో ఈ-స్టాంప్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించి స్టాంపులు పొందవచ్చని, ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కృష్ణా నీటి వివాదాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కేటాయింపులను యథావిధిగా అమలు చేయాలన్నారు. మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందన్నారు. ఒకవైపు కేసు విచారణలో ఉండగానే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందన్నారు.

అమ్మృతానగర్ వాసుల సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అమృతానగర్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే వారిని పిలిపించి అధికారుల సమక్షంలో మాట్లాడారు. అమృతానగర్‌లో సచివాలయం వెనుక వైపున ఉన్న ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి వసతి లేదని తెలిపారు. సదుపాయాలు కల్పిస్తే తాము ఇళ్లు నిర్మించుకుంటామని, చాలా మందికి ఇళ్లు కట్టుకునేందుకు రుణం మంజూరు కాలేదన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో రూరల్ ఏఈతోపాటు హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే పిలిపించి మాట్లాడారు. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యానికి ఏమేరకు డబ్బు ఖర్చవుతుందో అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, హౌసింగ్ అధికారులు, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, పిట్టా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని యానాది కాలనీలో రూ.70 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో ఈ నిర్మాణ పనులను చేపడుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోషా, ఉప సర్పంచ్ బీరం రాఘవరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్లకు బీమా సౌకర్యం కల్పిస్తా

ప్రొద్దుటూరు : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వలంటీర్లకు త్వరలో ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంపై ప్రొద్దుటూరు మండల పరిధిలోని సచివాలయ, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీమాపై ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించానన్నారు. ప్రమాదం జరిగితే రూ. 10లక్షలు చెల్లించేలా నిర్ణయించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్లేల రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబులరెడ్డి, రాజుపాళెం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి, సర్పంచ్ మోపూరి ప్రశాంతి, ఉపసర్పంచ్ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.